7

# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా




శుక్రవారం ၊ 8 ၊ మార్చి ၊ 2024

## న్యూస్‌రీల్

### చింతూరు డీఎఫ్‌వోగా బబిత



చింతూరు: చింతూరు అటవీ డివిజన్ డీఎఫ్‌వోగా 2018 బ్యాచ్‌కు చెందిన బబితను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం చింతూరు డీఎఫ్‌వోగా పనిచేస్తున్న పుష్పసౌజన్యను బదిలీ చేస్తూ పీసీసీఎఫ్‌కు రిపోర్ట్ చేయాలని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆమె చింతూరు డీఎఫ్‌వోగా పది నెలల పాటు ఇక్కడ విధులు నిర్వహించారు.

### ఈవీఎంల వినియోగంపై అవగాహన అవసరం



ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ విజయసునీత

సాక్షి,పాడేరు: ఓటు హక్కు కలిగి ఉన్న మహిళలంతా ఈవీఎంల వినియోగంగాపై అవగాహన పొందాలని కలెక్టర్ విజయ సునీత సూచించారు.గురువారం కలెక్టరేట్‌లో వైఎస్సార్ చేయూత లబ్ధిదారులైన మహిళా ఓటర్లకు ఓటు హక్కు వినియోగం, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల పనితీరుపై ఆమె అవగాహన కల్పించారు. డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఎస్‌డీసీ వి.వి.శర్మ పాల్గొన్నారు.

### ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన జగన్

- జిల్లా వైద్యారోగ్య ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు శెట్టి నాగరాజు



పాడేరు : తమ చిరకాల కోరికను సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేరవేర్చి మా జీవితాల్లో కొత్త వెలుగులు నింపారని జిల్లా వైద్యారోగ్య ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు శెట్టి నాగరాజు పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా నిర్లక్షం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏ ఒక్క ఉద్యోగిని కూడా రెగ్యులర్ చేయాలేదన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను గత టీడీపీ ప్రభుత్వం వంచనకు గురి చేసిందని విమర్శించారు. గురువారం విడుదల చేసిన రెగ్యులర్ అయిన ఉద్యోగుల జాబితాలో పాడేరు ఐటీడీఏ పరిధి వైద్యారోగ్య శాఖకు చెందిన సుమారు 80 మంది ఉండటం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు, వారి కుటుంబాలు సీఎం జగన్మోహన్‌రెడ్డికి అండగా ఉంటామన్నారు.

### అమ్మవారి ఆలయంలో సంప్రోక్షణ



సంప్రోక్షణ నిర్వహిస్తున్న అర్చకుడు

దేవీపట్నం: గండిపోసమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం సంప్రోక్షణ నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యామ్ నిర్మాణంతో గోదావరి బ్యాక్ వాటర్ కారణంగా అమ్మవారి ఆలయం గత జూలైలో నీట మునిగింది. ఇటీవల గోదావరి నీటిమట్టం తగ్గడంతో ఆలయం బయటపడింది. ఈ నేపథ్యంలో గురువారం అమ్మవారికి వేద మంత్రాలతో 108 బిందెలు నీళ్ల తో అభిషేకం నిర్వహించి సంప్రోక్షణ చేశారు. ఆలయం వద్ద విద్యుత్ తదితర సదుపాయం కల్పించిన తరువాత అమ్మవారి దర్శన తేదీని ప్రకటిస్తామని ఈవో జీవీ లక్ష్మీకుమార్ తెలిపారు.

### కోరం లేక జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు వాయిదా

మహారాణిపేట: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు గురువారం కోరం లేక వాయిదా పడ్డాయి. ఒకటి నుంచి 7 స్థాయీ సంఘాల సమావేశాలకు జిల్లా పరిషత్ సీఈవో పోలినాయుడు ఏర్పాట్లు చేశారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడలో జరిగిన వైఎస్సార్ చేయూత అధికారిక కార్యక్రమం కావడంతో సభ్యులు, అధికారులు అక్కడికి వెళ్లారు. దీంతో స్థాయీ సంఘాల సమావేశాలను వాయిదా వేసినట్లు డిప్యూటీ సీఈవో సత్యనారాయణ తెలిపారు. మళ్లీ ఎప్పుడు సమావేశాలు నిర్వహించే విషయాన్ని త్వరలో ప్రకటిస్తామన్నారు.

అనకాపల్లి మండలం పిసినికాడ సభలో పాల్గొన్న జన సందోహం, ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



# జన హర్షం పూల వర్షం

ప్రభం'జనం'.. వెల్లువెత్తిన అభిమానం.. ఉప్పొంగిన ఉత్సాహం.. సంక్షేమ సారథిపై అడుగడుగునా పూల వర్షం.. పేదల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్న జననేతకు జన నీరాజనం.. నూతన జిల్లాగా ఏర్పడిన తరువాత మొదటిసారి అనకాపల్లి నియోజకవర్గానికి విచ్చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ప్రియతమ సీఎం ప్రసంగానికి కరతాళ ధ్వనులతో హర్షం వెలిబుచ్చారు. ముఖ్యమంత్రిని చూసిన ఆనందంలో అక్కచెల్లెమ్మల సందడి అనకాపల్లి మండలం పిసినికాడలో గురువారం జాతరను తలపించింది. మహాశివరాత్రి పర్వదినం ముందే వచ్చిందా అన్నట్లు జాతీయ రహదారి అంతా పండగ వాతావరణం కనిపించింది. ఓ పెద్ద కొడుకు.. ఓ పెద్దన్న వచ్చినంత ఆనందంగా ఉందని మహిళలు ఉప్పొంగిపోయారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు అభిమాన నేతకు బ్రహ్మరథం పట్టారు. ఈ ఐదేళ్లలో పొందిన లబ్ధికి కృతజ్ఞతగా 'థాంక్యూ సీఎం సర్' అంటూ ప్లకార్డులు పట్టుకుని హర్షం వ్యక్తం చేశారు.

- అట్టహాసంగా చేయూత నాలుగో విడత నిధుల పంపిణీ
- జై జగన్.. వన్స్‌మోర్ సీఎం.. నినాదాలతో హోరెత్తిన అనకాపల్లి
- ముఖ్యమంత్రి దృష్టికి అనకాపల్లి సమస్యలు తీసుకెళ్లిన మంత్రి అమర్‌నాథ్
- రూ.21 కోట్లతో వాటిని పరిష్కరిస్తానని సీఎం వైఎస్ జగన్ హామీ




సీఎంకు మహిళల అభివాదం

సాక్షి, అనకాపల్లి:

అభిమానం.. ఆత్మీయత అంటే ఇలా ఉంటుందన్న రీతిలో సాగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం.. అందుకు ప్రతిస్పందనగా ప్రజల నుంచి వ్యక్తమైన హర్షాతిరేకంతో అనకాపల్లి మండలం పిసినికాడ ఓ అపూర్వమైన సందర్భానికి వేదికగా నిలిచింది. సీఎం మాట్లాడుతున్నంతసేపూ జనం కరతాళధ్వనులతో ఆప్యాయత వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు సీఎం వైఎస్ జగన్ వివరించారు. 99 శాతం హామీలు అమలు చేయడమే కాకుండా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేవిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, వాటితో లబ్ధి పొందిన పేద ప్రజల గురించి తెలిపారు. గత టీడీపీ–జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన అబద్ధపు హామీలు నెరవేర్చకుండా ప్రజలను ఎలా మోసం చేశారో విపులీకరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో అనుభవించిన కష్టాలు, వైఎస్సార్‌సీపీ 58 నెలల పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని పిలుపునిచ్చారు. దీంతో వన్స్‌మోర్ సీఎం.. జై జగన్.. అని నినాదాలు చేస్తూ ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలికారు. మహిళాభ్యున్నతికి చేపడుతున్న పథకాలను సీఎం వివరిస్తుండగా అక్కచెల్లెమ్మలు థాంక్యూ సీఎం సర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి అభిమానాన్ని చాటుకున్నారు. సభా ప్రాంగణం మొత్తం జనంతో నిండిపోగా.. సభావేదిక వెలుపల వేలాది మంది నిల్చొని అభిమాన నేత ప్రసంగాన్ని ఆసక్తిగా ఆలకించడం కనిపించింది.




సీఎం జగన్‌తోపాటు వేదికపై డిప్యూటీ సీఎంలు రాజన్నదొర, ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, అమర్‌నాథ్, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీలు సత్యవతి, మాధవి, ఎమ్మెల్యేలు గణేష్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



బటన్ నొక్కి చేయూత నిధులు విడుదల చేస్తున్న సీఎం జగన్

**సభ జరిగిందిలా..**

విశాఖ నుంచి హెలికాప్టర్‌లో కశింకోట వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. రోడ్డు మార్గంలో అనకాపల్లి మండలం పిసినికాడ సభావేదిక వద్దకు ఉదయం 11.10 గంటలకు చేరుకున్నారు. వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం వైఎస్సార్ చేయూత నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి జిల్లాలో వైఎస్సార్ చేయూత లబ్ధిదారుల వివరాలతోపాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ 58 నెలల పాలనలో నవరత్నాల పేరిట లబ్ధి పొందిన వారి గురించి వివరించారు. అనంతరం జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. అనంతరం అనకాపల్లి ఎమ్మెల్యే, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో పేదలకు జరిగిన మేలు వివరించారు. అనంతరం జిల్లాలో లబ్ధి పొందిన ఇద్దరు మహిళలు తమకు అందిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటితో ఏ విధంగా లాభం పొందారో వివరించారు. పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్ల మండలం రామచంద్ర పాలేనికి చెందిన రమణమ్మ, చీడికాడ మండలం గండివరం గ్రామానికి చెందిన సుంకర వెంకటలక్ష్మి సీఎం సమక్షంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పొందిన లబ్ధి, సంక్షేమం గురించి వివరించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి లబ్ధిదారులందరి తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించారు. బటన్ నొక్కి వైఎస్సార్ చేయూత నాలుగో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళామార్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు.

**అభివృద్ధి పథంలో అనకాపల్లి : కలెక్టర్**

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ చేయూత కింద జిల్లాలో లక్షా 16 వేల మంది లబ్ధి పొందారని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. వీరికి రూ.582.91 కోట్లు చెల్లించామన్నారు. నాలుగో విడతలో రూ.218.31 కోట్లు మంజూరైనట్టు వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధుల సహకారంతో అనకాపల్లి జిల్లా అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందన్నారు.

### అనకాపల్లికి సీఎం వరాల జల్లు..

**అనకాపల్లి నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు వరాలు కురిపించారు.** వైఎస్సార్ చేయూత నాలుగో విడత పంపిణీ కార్యక్రమంలో సభా వేదిక సాక్షిగా రూ.21 కోట్లతో తలపెట్టే పలు అభివృద్ధి పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత వీటిని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా పైవిధంగా స్పందించారు. వాటిలో...

- రూ.5 కోట్లతో అనకాపల్లి వ్యవసాయ మార్కెట్‌లో నూతన కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం, మార్కెట్ యార్డ్‌లో షాపింగ్ కాంప్లెక్స్‌లు, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు
- రూ.3 కోట్లతో కశింకోటలో శారదానదిపై అసంపూర్తిగా ఉన్నటువంటి బ్రిడ్జి నిర్మాణం
- రూ.3 కోట్లతో రేబాక నుంచి కొప్పాక వరకూ డబుల్ రోడ్డు నిర్మాణం
- రూ.4 కోట్లతో గవరపాలెం నుంచి తుమ్మపాల, తుమ్మపాల నుంచి బొజ్జనకొండ వరకూ వెళ్లే రోడ్డు నిర్మాణం
- కశింకోటలో జగనన్న కాలనీ నిర్మించారు. శారదా నది ఒడ్డున ఈ కాలనీ చుట్టూ రూ.6 కోట్లతో రిటర్నింగ్ వాల్ నిర్మాణం



మహిళామార్ట్‌లో ప్రతిభ చూపిన వారికి అవార్డు ప్రదానం



సీఎంకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్ తదితరులు



ముఖ్యమంత్రి జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన అభిమానులు

## 53,735 మందికి వైఎస్సార్ చేయూత

- మహిళల బ్యాంక్ ఖాతాల్లో రూ.100.75 కోట్లు జమ
- కలెక్టర్ విజయ సునీత



చేయూత నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ విజయ సునీత, మహిళలు, అధికారులు

సాక్షి,పాడేరు: మహిళా సాధికారితకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని కలెక్టర్ పి.విజయసునీత అన్నా రు. నాలుగో విడత వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడలో గురువారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్, అధికారులు, మహిళలు వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత నాలుగో విడతలో జిల్లాలోని 53,735 మంది మహిళల వ్యక్తిగత ఖాతాల్లో రూ.100.75 కోట్లను ప్రభుత్వం జమ చేసిందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటోందన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత, గృహ నిర్మాణ పథకాలను ప్రభుత్వం మహిళకు మంజూరు చేస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల్లోని పేదమహిళలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమె కోరారు. అనంతరం కలెక్టర్ నమూనా చెక్కును పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, డీపీఎంలు, వెలుగు ఏపీఎంలు, ఏరియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## సింహాచల క్షేత్ర వైభవం.. విశ్వవ్యాప్తం

- ప్రసాద్ స్కీమ్‌తో మారనున్న రూపురేఖలు
- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన



థింసా నృత్యం చేస్తున్న గిరిజనులు

సింహాచలం: దేశవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి ప్రధాని మోదీ తీసుకున్న చర్యలు అభినందనీయమని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సింహాచల క్షేత్రంలో ప్రసాద్ స్కీమ్ నిధులు 54.04 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులు, స్వదేశ్ దర్శన్ పథకంలో భాగంగా రూ.30 కోట్లతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని బొర్రా గుహల వద్ద చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ప్రధాని మోదీ జమ్మూకశ్మీర్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

**బొర్రా అభివృద్ధి ఇలా..**

స్వదేశ్ దర్శన్ పథకంలో భాగంగా బొర్రా గుహల ప్రధాన ప్రవేశం, పార్కింగ్, టాయిలెట్ బ్లాక్‌లు, వీధుల అభివృద్ధి, గుహల బయట యాత్రికులు వేచి ఉండే గదులు, గుహ మార్గం అభివృద్ధి, ఫుడ్ ప్లాజాలు, గుహల లోపల పూర్తి స్థాయిలో మార్పులు, లైటింగ్ పనులు వంటివి చేపడతారు.

## మహిళా సాధికారత లక్ష్యం

కొత్తగా ఏర్పడిన జిల్లా.. పూర్తిగా గిరిజన ప్రాంతం.. తొలి మహిళా కలెక్టర్‌గా బాధ్యతలు.. విధుల్లో చేరిన కొద్దిరోజుల్లోనే పూర్తి అవగాహన పొందేందుకు విస్తృతంగా పర్యటనలు.. ఒక పక్క ప్రభుత్వ లక్ష్యసాధన.. మరోపక్క ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉన్న విజయ సునీత ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని 'సాక్షి'తో మాట్లాడారు.. ఆవివరాలు..

- ప్రథమ పౌరురాలు ముర్ము ఆదివాసీ కావడం గిరిజన జాతికి గౌరవం
- ఆమె జీవితం స్ఫూర్తిదాయకం
- కలెక్టర్ విజయ సునీత



సాక్షి,పాడేరు: పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించేలా మహిళలు లక్ష్యసాధనతో ముందుకు సాగాలని కలెక్టర్ పి.విజయ సునీత పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంతానికి చెందిన ఆదివాసీ మహిళ ముర్ము భారత రాష్ట్రపతి పదవిలో ఉండటం గిరిజన జాతికే గౌరవమన్నారు. ప్రతీ మహిళ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని, ఆమె జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. తాను ప్రాథమిక విద్యను అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో అభ్యసించినట్టు చెప్పారు. అప్పటి పరిస్థితులతో పోలిస్తే అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, విద్యాప్రమాణాలు ఎంతో మెరుగుపడ్డాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా పనిచేస్తున్నాయన్నారు.

**కొత్త జిల్లాకు తొలి మహిళా కలెక్టర్‌గా..**

కొత్తగా ఏర్పడిన అల్లూరి సీతారామరాజు జిల్లాకు తాను మొదటి మహిళా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం గర్వంగాను, అదృష్టంగా భావిస్తున్నట్టు విజయ సునీత పేర్కొన్నారు. సాటి మహిళగా, మహిళా ఉన్నతాధికారిగా జిల్లాలోని మహిళల సమగ్రాభివృద్ధికి ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. బాలికల్లో అక్షరాస్యత శాతం పెంచడంతో పాటు ఉన్నత విద్య, ఉద్యోగాలు లక్ష్యాలను నిర్మిస్తామన్నారు. డ్రాపౌట్లు లేకుండా బాల్య వివాహాలకు కూడా బాలికలు దూరంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతం**

ఉద్యోగ, ఉపాధి అవకాశాలను జిల్లాలో విస్తృతం చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. వైద్యపరంగా బాలికలు, మహిళల్లో రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యల నివారణపై దృష్టి సారిస్తున్నట్టు చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్‌ల సేవలను మహిళలకు మరింత చేరువ చేస్తానన్నారు. జిల్లాలో మహిళల సమస్యలపై అధ్యయనం చేస్తున్నట్టు చెప్పారు. రానున్న రోజుల్లో మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రణాళికపరంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. జిల్లాపై ఇప్పటికే ఒక అవగాహన ఏర్పడిందన్నారు. జిల్లాలో వెనుకబడిన మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మరింత చేరువ చేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. ,ప్రభుత్వం నిర్దేశించిన మహిళా సాధికారిత లక్ష్యాలను సాధించేందుకు తన బాధ్యతలను పారదర్శకంగా, చిత్తశుద్ధితో నిర్వహిస్తామని కలెక్టర్ విజయ సునీత పేర్కొన్నారు.

## మత్స్యగుండంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



మత్స్యదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు

హుకుంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక కేంద్రమైన మత్స్యగుండంలో మహా శివరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీశ్రీ మత్స్యలింగేశ్వర స్వామివారిని భక్తులు సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. మత్స్యగెడ్డ వద్ద మత్స్యదేవతలను ప్రసాదాలు సమర్పించి పూజలు నిర్వహించారు. గిరిజన విలేకరుల సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటుచేశారు. స్థానిక వైద్యాధికారి గాయత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసినట్టు సీఐ సన్యాసినాయుడు తెలిపారు. జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం డీఎంహెచ్‌వో జమాల్‌బాషా సందర్శించారు.



అనకాపల్లి మండలం పిసినికాడ వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ

## సజావుగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

**రంపచోడవరం:** త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని 11 మండలాల్లో 399 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సెక్టార్ అధికారులు 59 మందిని నియమించినట్టు చెప్పారు. రంపచోడవరం అసెంబ్లీ ఈవీఎంలను భద్రపరిచేందుకు గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతిగృహ ప్రాంగణంలో స్ట్రాంగ్ రూం ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికలకు ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్ రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేస్తామన్నారు. వివిధ పార్టీలకు చెందిన పి. శ్రీనివాసరావు, కె.బాలకృష్ణ, ఎస్.బొజ్జిరెడ్డి, సిద్ధ వెంకన్నబాబు, ఎం, వాణిశ్రీ, లోత రామారావు, తహసీల్దార్ ఎ. కృష్ణజ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ ఎన్‌పీవీ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్లు లక్ష్మణ్, ఇందిరా బాయ్, మణికంఠ పాల్గొన్నారు.

**పాస్‌పోర్టు పడిపోయినది**
కంకిపాటి హరీష్, తండ్రి రామ్మూర్తి, డో.నెం. 1-77, హైస్కూల్ దగ్గర, ఇందుకూరి పేట, దేవీపట్నం కాపురస్తులు అయిన నేను నా ఇంటి వద్ద నుండి పాస్‌పోర్టును జిరాక్సు తీసుకునేందుకు వెళ్ళుచుండగా మార్గమధ్యములో పాస్‌పోర్టు నెం. ఎస్-9710722 పడిపోయినది. దొరికిన వారు అందజేయగలరని కోరుతున్నాము.
సెల్ : 8309267658

రికవరీ ఆఫీసర్-II వారి కార్యాలయం
**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్**
భారత ప్రభుత్వము, ఆర్థిక మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (బ్యాంకింగ్ విభాగం)
31-31-21, గ్రౌండ్ & 1వ అంతస్తు, నారాయణ భవనం, సాయిబాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020, ఎ.పి.
ఫోన్: 0891-2957045, ఇ-మెయిల్: ro2.drtvpatnam@gmail.com
**RP/818/2019 in OA/544/2018**
కెనరా బ్యాంక్, సిరిపురం బ్రాంచ్, విశాఖపట్నం
వర్సెస్
శ్రీమతి కేలాని రాజ రాజేశ్వరి మరియు ఇతరులు
**విషయం: ఇ-వేలం అమ్మకం వాయిదా ప్రకటన**
[illegible] 06.01.2024 తేదీతో జారీచేసిన సేల్ ప్రొక్లమేషన్ / ఇ-వేలం అమ్మకపు నోటీసు ప్రకారం https://www.bankeauctions.com వెబ్‌సైట్‌లో 16.02.2024న తేదీన జరుపవలసిన [illegible] ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకం [illegible] తేదీ 14.02.2024 [illegible] ఇ-వేలం 11.03.2024 నకు వాయిదా వేయబడినది. [illegible] ఇ-వేలం అమ్మకం తేదీ 30.03.2024 వరకు వాయిదా వేయబడినది. ధరావత్తు మరియు బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేదీ 27.03.2024 మరియు బిడ్ హార్డ్‌కాపీలను సమర్పించుటకు ఆఖరు తేదీ 26.03.2024. ఈ 06.01.2024 తో జారీచేసిన సేల్ ప్రొక్లమేషన్ / ఇ-వేలం అమ్మకపు నోటీసు లోని నియమనిబంధనలలో ఏ మార్పు లేదు.
(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రతో విశాఖపట్నం వద్ద తేది. 06-03-2024 న జారీ చేయబడినది)
(పి.వి.ఎస్.బి.ఎస్.ఆర్. బంగార్రాజు) రికవరీ ఆఫీసర్

# సహజీవనం చేసిన వ్యక్తే చంపేశాడు

- మహిళ మృతి కేసులో వీడిన మిస్టరీ
- రంపచోడవరం సీఐ వెంకటేశ్వరరావు వెల్లడి



పోలీసుల మధ్యలో నిందితుడు రమణబాబు (ముసుగు)

**రంపచోడవరం:** అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మహిళ కేసును స్థానిక పోలీసులు ఛేదించారు. ఆమె సహజీవనం చేసిన వ్యక్తే కొట్టి చంపేయడంతో హత్యకేసుగా నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మండలంలోని కొత్తపాకలు–చిలకమామిడి గ్రామాల మధ్య వాగులో వద్ద మడిచర్ల గ్రామానికి చెందిన బిళ్లా ఆదిలక్ష్మి (31) గత నెల 27న అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండటం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులకు దర్యాప్తులో ఆసక్తి కరమైన విషయాలు తెలిశాయి. ఇందుకు సంబంధించిన వివరాలను రంపచోడవరం సీఐ వాసా వెంకటేశ్వరరావు గురువారం వెల్లడించారు. మండలంలోని మడిచర్ల గ్రామానికి చెందిన కొండపల్లి రమణబాబు, మృతురాలు బిళ్లా లక్ష్మి రాజమహేంద్రవరం సమీపంలోని రాయుడు పాకలు గ్రామంలో అట్టలు తయారీ ఫ్యాక్టరీలో కూలి పని చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. ఆదిలక్ష్మి భర్త ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటినుంచి ఆమె రమణబాబుతో సహజీవనం చేస్తోంది. ఈ నేపథ్యంలో గర్భం దాల్చిన ఆమెతో కలిసి రమణబాబు గత నెల 25న మడిచర్ల గ్రామానికి వచ్చారు. అక్కడి నుంచి రంపచోడవరం బయలుదేరారు. గర్భం తీయించుకునేందుకు లక్ష్మి అతన్ని డబ్బులు అడిగింది. దీంతో ఆగ్రహానికి గురైన రమణబాబు ఆమెను తీవ్రంగా కొట్టాడు. ఆమెను బండరాయికి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. వాగు వద్ద ఆమె మృతదేహాన్ని వదిలి వెళ్లిపోయాడు. గ్రామస్తుల నుంచి సమాచారం సేకరించిన పోలీసులకు రమణబాబును విచారించారు. తీవ్రంగా కొట్టడంతో లక్ష్మి మృతి చెందినట్టు అతను అంగీకరించాడని సీఐ తెలిపారు. ఈ మేరకు అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన వివరించారు.

## ఘనంగా ఉమానీలకంఠేశ్వరుని ఊరేగింపు



ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు



యువతుల కోలాటం

**సాక్షి,పాడేరు:** పట్టణంలోని పాతబస్టాండ్ శివాలయంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను గురువారం రాత్రి పాడేరు పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. కోలాటం, నృత్య రూపకాలు, డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో అర్చకుడు రామం, ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, వర్తక సంఘం నేతలు ఆర్‌కే రామకృష్ణ, శివరాత్రి శ్రీనివాసరావు, ఉప్పల వెంకటరత్నం, సాధనాల ఈశ్వరి పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక కృషి

**కలెక్టర్ విజయ సునీత**



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయసునీత, ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

**సాక్షి,పాడేరు:** గిరిజన ప్రాంతం సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తానని కలెక్టర్ పి.విజయసునీత తెలిపారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం ప్రాంగణంలో రూ.4.45 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ.2.82కోట్ల అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ విజయ సునీత, ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో కాలంగా పరిష్కారం కాని అభివృద్ధి పనులకు ఐటీడీఏ పీవో చొరవతో మోక్షం ఏర్పడిందన్నారు. ఐటీడీఏ ఏపీవోలు వి.ఎస్.ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు, పాడేరు, హుకుంపేట ఎంపీపీలు ఎస్.రత్నకుమారి, కూడా రాజబాబు, గిరిజన సంక్షేమశాఖ పాడేరు, అరకు ఈఈలు డి.వి.ఆర్.ఎం.రాజు, కె.వేణుగోపాల్, డీఈఈ అనుదీప్, డీఆర్‌డీఏ పీడీ మురళీ, జిల్లా వ్యవసాయ మండలి అధ్యక్షురాలు సరస్వతి, పాడేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ లకే రామసత్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, మహిళా విభాగం నేత కోడా సుశీల పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

**చింతూరు:** స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఎపికోర్, యునిసెఫ్ ఆధ్వర్యంలో గ్రీన్ అండ్ క్లైమేట్ రీ సైలెంట్ హెల్త్‌కేర్ ఫెసిలిటీస్‌పై పీహెచ్‌సీ వైద్యులకు గురవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐటీడీఏ పీవో కావూరి చైతన్య మాట్లాడుతూ వాతావరణంలో సమతుల్యత లేక అనేక మార్పులు సంభవిస్తున్నాయన్నారు. ఇందుకోసం పర్యావరణ పరిరక్షించుకోవాలన్నారు. ఆస్పత్రుల ఆవరణల్లో చెట్లు నాటాలని పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని పీవో సూచించారు. సీనియర్ సైంటిస్ట్ సాయిభాస్కర రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, ఎపికోర్, యునిసెఫ్ ప్రతినిధులు కాశేశ్వరరావు, నిర్మలకుమారి పాల్గొన్నారు.

# రంప శివాలయానికి పంచలోహ విగ్రహాలు

- ఊరేగింపుగా తరలింపు



పంచలోహ విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న ఏఎస్పీ జగదీష్, భక్తులు

**రంపచోడవరం:** మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పంచలోహ విగ్రహాలను రంప భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయానికి గురువారం భారీ బందోబస్తు మధ్య ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఏటా ఉత్సవాలు ముగించిన అనంతరం వీటిని స్థానిక పోలీసుస్టేషన్లో భద్రపరిచి ఉత్సవాల సమయానికి తీసుకువస్తుంటారు. దీనిలో భాగంగా పోలీసుస్టేషన్‌లో విగ్రహాలకు ఏఎస్పీ జగదీష్ అడహళ్లి పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఆలయ అర్చకులు గొడవర్తి ప్రసన్నకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పండా రామకృష్ణదొర, మంగా తమ్మన్నకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
AMG B.Ed.COLLEGE
Bheemunipatnam, Visakhapatnam District
WANTED FACULTY
Physical Sciences & Social Sciences
Qualification : M.Sc. & M.A. (55%), M.Ed. (55%)
PHONE : 08933-229118
94943 74038, 94409 10854

## గ్రామాల్లో సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు

**రాజవొమ్మంగి:** విద్యానగర్, అప్పలరాజుపేట, జడ్డంగి ప్రాంతాల్లో గురువారం సికెల్‌సెల్ పరీక్షలు చేశారు. వైద్యులు యామినిప్రియదర్శిని, నాగార్జున, ఎంఎల్‌హెచ్‌పీ కె.సుష్మా వైద్య సేవలందించి రక్తహీనతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

# శక్తిమంతులు స్త్రీమూర్తులు



కలెక్టర్ విజయ సునీతను సత్కరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డిని సత్కరిస్తున్న కలెక్టర్ విజయ సునీత, ఐసీడీఎస్ అధికారులు

- కలెక్టర్ విజయ సునీత
- ఘనంగా మహిళా దినోత్సవం

**పాడేరు :** జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వాటిని ఎదుర్కొని అధిగమిస్తున్న శక్తి మంతులు స్త్రీమూర్తులని కలెక్టర్ విజయ సునీత అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచానికి రంగులు అద్దేది మహిళనేనన్నారు. సహనమే స్త్రీ మూర్తికి బలమని వారు శ్రమతో ఏదైనా సాధించగలరని అన్నారు. ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ సకల దేవతలు నివసిస్తారన్నారు. ప్రతీ ఇంట్లో దేవుడు అమ్మ రూపంలో ఉంటారన్నారు. సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహిళల ఎదుగుదలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎగదగాలన్నారు. మహిళలు హద్దులు గీసుకోకుండా భయం వీడి ముందడుగు వేయాలన్నారు. కలెక్టర్ విజయ సునీత, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డిని ఐసీడీఎస్ అధికారులు, మహిళలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, మినుములూరు సర్పంచ్ లంకెల చిట్టమ్మ, జిల్లాలోని పలువురు సీడీపీవోలు, పలు పాఠశాలల విద్యార్థినిలు, మహిళలు పాల్గొన్నారు.

# ఓటర్లకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు

**పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్**



ఎగువశోభ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో



భీంపోల్ ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థినిలకు పాఠాలు భోదిస్తున్న పీవో అభిషేక్

**అనంతగిరి:** ఓటర్లకు ఇబ్బందులు లేకుంగా పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. మండలంలోని గురువారం అనంతగిరి, కొండిబ, గరుగుబిల్లి, కాశీపట్నం, ఎగువవశోభ, కొత్తూరు తదితర ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. అనంతరం భీమవరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడారు. మందుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అక్కడ నుంచి భీంపోల్ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు, టెన్త్ విద్యార్థులకు పాఠం బోధించారు. ఎంఈవో బాలాజీ, డీటీ మాణిక్యం, ఆర్ఐ శంకరరావు పాల్గొన్నారు.

## గంజాయితో వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడితో పోలీసులు

**చింతూరు:** తులుగొండకు చెందిన రామాంజనేయులు తన ఆటోలో 25 కిలోల గంజాయి తరలిస్తుండగా చట్టి జంక్షన్ వద్ద పోలీసులు గురువారం అరెస్టు చేశారు. చట్టి జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా తారసపడిన ఆటోను ఆపి సోదా చేయగా రూ. 1.25 లక్షల విలువైన 25 కిలోల గంజాయి లభ్యమైనట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. గంజాయిని ఒడిశాలో కొనుగోలు చేసి తెలంగాణకు తరలించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో రామాంజనేయులును అరెస్టు చేశామని మరో ముగ్గురు పరారీలో ఉన్నట్టు ఆయన తెలిపారు.

# నాణ్యత ప్రమాణాలపై దృష్టి పెట్టండి

**చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య**



మాట్లాడుతున్న పీవో కావూరి చైతన్య

**చింతూరు:** మార్కెట్లో విక్రయించే వస్తువుల నాణ్యతా ప్రమాణాలపై సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశించారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్)పై చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు నిధులు సేకరించడంలో సర్పంచ్‌లు, కార్యదర్శుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బీఐఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణవీరవర్మ మాట్లాడుతూ వస్తువులు కొనుగోలు చేయడంలో ప్రధానంగా నాణ్యతను గుర్తించాలని, నాణ్యత లేకుంటే సంస్థ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. గుర్తింపులేని వస్తువులను కొనుగోలు చేయడం ప్రమాదకరమని, నిబంధనలు అతిక్రమించిన కొనుగోలు దారులపై రూ.2 లక్షలు జరిమానా విధించే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో రాఘవన్, ఏపీవో సుజాత పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం





ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, జర్రకొండ ర్యాలీలో పాల్గొన్న నాయకులు



ఇంజరిలో ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు



పాడేరులో పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, నేతలు



సొలభంలో మాట్లాడుతున్న సర్పంచ్ హనుమంతరావు



ముసిరిలో పర్యటిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, నేతలు

**అరకులోయ రూరల్/ముంచంగిపుట్టు/హుకుంపేట/పెదబయలు/అరకుటౌన్/పాడేరు/జి.మాడుగుల:** రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ నేతలు మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమాలను అరకులోయ, పాడేరు నియోజకవర్గాల్లో గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు తదితరులు గ్రామాల్లో పర్యటించారు. జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం జగనన్నకు అందరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. అరకు, ముంచంగిపుట్టు, హుకుంపేట, పెదబయలు, డుంబ్రిగుడ, పాడేరు, జి.మాడుగుల మండలాల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, కొండబాబు, ఆనందరావు, మల్లేశ్వరరావు, రాంబాబు, మత్స్యంనాయుడు, నేతలు శెట్టి అప్పాలు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబందు, వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచుల నీలకంఠం, గంగాధర్, వసంత, సన్నిబాబు, హనుమంతరావు, చినకుమారి, ఎంపీటీసీ సభ్యులు శత్రుగున్, సోయిత,కమల, పద్మ, రామరావు, కన్వీనర్లు కొండలరావు, కోటేశ్వరరావు, జేసీఎస్ ఇన్‌చార్జి రామకృష్ణ, కళ్యాణం తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం దగ్ధం

- నడుపుతుండగా మంటలు



మంటల్లో దగ్ధమవుతున్న బైక్

**కొయ్యూరు:** బైక్‌ను నడుపుతుండగా మంటలు చెలరేగడంతో దగ్ధమైంది. బూదరాళ్ల పంచాయతీ బాలరేవులకు చెందిన వంతల బాబూరావు మరొకరితో కలిసి ద్విచక్ర వాహనంపై గురువారం కొయ్యూరు బయలుదేరారు. చింతవానిపాలెం దగ్గరకు వచ్చేసరికి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు దూకేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. బైక్ పూర్తిగా దగ్ధమైంది. ఎండ తీవ్రతకు ఇంజిన్ వేడెక్కడం వల్లే మంటలు ఏర్పడటానికి కారణమని బాధితుడు బాబూరావు తెలిపారు.

**సాక్షి క్లాసిఫైడ్స్**

**Education**

- Mohan's Reading Room (New) / Spoken English new batch, PM Palem Ph: 9032667955/ 8309911733 [WB-52414]
- Wanted to successful pass Degree and PG in Distance Mode. Contact: 9642656449, 9703116054 [G-801052]

**Real Estate**

**ప్లాట్స్ అమ్మకం**
అనకాపల్లి జిల్లా, దేవరాపల్లి మండలం గరిసింగి (ఎన్.ఎ.డి. జంక్షన్ నుండి 50 కి.మీ.) వద్ద 60 ఎకరాలలో అగర్, శాండిల్ ఉడ్ & డేట్స్ ప్లాంటేషన్ మరియు రిసార్ట్స్ (క్లబ్‌హౌస్, స్విమ్మింగ్‌పూల్, కాటేజెస్, కేంపింగ్, బోటింగ్ & ఫిషింగ్ లాంటివి) సదుపాయాలతో అభివృద్ధి చేయబడుచున్న వెంచర్ "ఫీనిక్స్ వ్యాలీ"లో ప్లాట్లు కొనుగోలు చేయుటకు / సైట్ విజిట్ చేయుటకు సంప్రదించండి.
7386435677

**PLOT FOR SALE**
- 1) పెందుర్తి, పినగాడి జంII దగ్గర్లో 40/30 ft తారురోడ్డు, డ్రైన్, కాంపౌండ్ వాల్‌తో @ 8500/- గII. 2) 1కోట / బొద్దాం దగ్గర 30ft రోడ్డు, నిమ్మ / కొబ్బరి మొక్కలతో @ 4500/- గII స్పాట్ రిజిII. ఫోన్ : 98859 57795 [V-3016]
- GVMC అప్పికొండ బీచ్‌కి వెళ్ళె రోడ్డులో 9 లక్షలకే 133 గజాలు 150 ప్లాట్స్ గలవు. దగ్గరలో ఇల్లులు, బస్సులు, బజారులు అన్ని సౌకర్యాలు కలవు. ఫోన్ : 81217 60605 [V-796986]

రియల్టీ సమాచారం కొరకు లాగాన్ కండి www.sakshi.com

- కేవలం 6,50,000/-కే ఇంటి స్థలం విజయనగరం సిటిలో అన్ని డవలప్‌మెంట్స్‌తో సులభమైన వాయిదా పద్దతి కలదు మరియు స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం. ఫోన్ : 90309 64482 [V- 697]

**RESTAURANT FOR SALE**
- Pizza Den (Continental) Restaurant For Sale. Only For 7.5 L. 750 Sft, Limited Time, Karasa Main Road, Near Indian Oil Petrol Bunk, NAD. Ph : 63020 12530, 91548 79440 [V- 797196]

**Services**

**GOLD LOANS**
- లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11574]

**Wanted**

- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9059663584. [M-1233871]
- Delivery Boys అర్జెంటుగా కావలెను. జీతం : 12,000/- & PF/ESI సదుపాయం కలదు. Insurance , Weekly Offs కలవు. ఫోన్ : 98490 80059, 81061 05517, 97046 15536 [V-791079]
- అనకాపల్లిలో ప్రముఖ రెడీమేడ్ గార్మెంట్ షోరూమ్‌లో పనిచేయుటకు మేనేజరు (పు) డిగ్రీ / స్టాఫ్ (10th/ఇంటర్) కావలెను. ఫోన్ : 90523 81026 [V-791078]
- Free Software Traning : B.Tech - Degree 21, 22, 23 Pass Outs, 4 Months Duration @ Dwarakanagar. Ph : 99633 66009, 95739 79344 [V-5525]
- మీరు ఉన్న చోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) 100% ఎటువంటి ఫీజులు ఉండవు. సంప్ర : 97015 05819 [V-797198]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 95736 33520,89197 39694. [M-1167540]
- హైదరాబాద్ నుండి 120 కి.మీ. దూరంలో వ్యవసాయం చేయడానికి * జంటలు (భార్యాభర్తలు) ట్రాక్టర్ | డ్రైవర్స్ & ఎలక్ట్రీషియన్స్ కావలెను. సంప్రII ప్రతి రోజు ఉII 6 - ఉII9 గంIIల వరకు. ఫోన్. 6305762058 [H-787732]

**గమనిక**
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**సాక్షి క్లాసిఫైడ్స్** లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి
మురళీనగర్, మాధవధార : 90101 33346
NAD, కంచరపాలెం : 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి : 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్ : 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలని, మద్దిలపాలెం : 90101 96663
గాజువాక : 97059 33394
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం